RNI NO:APTEL/2018/76747

# నవతరం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : శిరిగిరి వరదరాజు

NAVATARAM TELUGU DAILY

నవతరం న్యూస్

పబ్లిషింగ్ : రాజమహేంద్రవరం | సంపుటి : 11 | సంచిక : 358 | AP/TEL/2018/76747 | మంగళవారం 10 - 02 - 2026 | పేజీలు : 04 | వెల : 01 రూ..

Published From: Srikakulam, Parvathipuram Manyam,Vizianagaram,Visakhapatnam,Alluri Sitharama Raju,Anakapalli,Kakinada,East Godavari ,Konaseema,Eluru,West Godavari,NTR,Krishna,Guntur,Bapatla,Nellore,Prakasam,Kurnool,Nandyal,Sri Sathya Sai,YSR,Annamayya,Tirupati,Chittoor

## నియోజకవర్గాలకు ర్యాంకులు


**ఎమ్మెల్యేల పనితీరుకు మార్కులు.. ఫస్ట్ ర్యాంక్ ఎవరిదంటే?**

- ఏపీలో 175 నియోజకవర్గాల పనితీరుపై ప్రభుత్వ ర్యాంకులు
- 93 శాతం మార్కులతో ప్రథమ స్థానంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం.....
- రెండో స్థానంలో నిలిచిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నియోజకవర్గం గాజువాక......
- గ్రేడులో 21,గ్రేడులో 153, బీ గ్రేడులో ఒకే ఒక్క నియోజకవర్గం
- ఎమ్మెల్యేల పనితీరు, పథకాల అమలు ఆధారంగా ర్యాంకుల కేటాయింపు

ఆంధ్రప్రదేశ్, నవతరం

ఏపీలో ప్రభుత్వ పాలనను పరుగులు పెట్టించేందుకు సీఎం చంద్రబాబు నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల పనితీరుపై సర్వే నిర్వహించి, వాటికి ర్యాంకులు, గ్రేడులు కేటాయించారు. ఎమ్మెల్యేల పనితీరు, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సంతృప్తి వంటి అంశాల ఆధారంగా చేపట్టిన ఈ సర్వేలో 93 శాతం మార్కులతో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఈ నియోజకవర్గానికి బీజేపీ నేత సుజనా చౌదరి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తాజాగా విడుదల చేసిన ఈ ర్యాంకుల్లో 92 శాతం మార్కులతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రాతినిధ్యం వహిస్తున్న గాజువాక

మిగతా.. 2 లో




## భార్యాభర్తల మాటలు కూడా విన్నారు




**ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేసిందన్న సీఎం రేవంత్**

- బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలూ ఒక్కటేనని ఆరోపణ
- వేల కోట్లు సంపాదించిన కేసీఆర్ పేదలకు ఇళ్లు కట్టలేదన్న విమర్శ
- కాళేశ్వరం కుంభకోణంపై సీబీఐ విచారణకు ఆదేశించాలన్న డిమాండ్
- జిల్లాల రద్దుపై వస్తున్న ప్రచారంలో నిజం లేదని స్పష్టీకరణ

2 మిగతా





## బ్రాండింగ్, నాణ్యతే ముఖ్యం

**స్వయం సహాయక సంఘాల కోసం 'స్వయం' పేరుతో ప్రత్యేక బ్రాండ్**


**రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలన్న సీఎం**

**రూ.300 కోట్లతో ఎస్టీపీల నిర్మాణం వేగవంతం చేయాలని సూచన**

ఆంధ్రప్రదేశ్, నవతరం

రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు మంత్రులు, కార్యదర్శులతో కీలక సమావేశం నిర్వహించారు. ఐదో బ్లాకులో జరిగిన ఈ సమావేశంలో ప్రొడక్ట్ పర్ఫెక్షన్, స్వచ్ఛాంధ్ర, గ్రీన్ కవర్ వంటి పలు అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. నాణ్యమైన ఉత్పత్తులకు సరైన బ్రాండింగ్ జోడిస్తేనే మెరుగైన మార్కెట్ సాధ్యమవుతుందని, ఈ దిశగా అధికారులు దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. స్వయం

మిగతాది 2 లో...



## ట్రంప్ మతిమరుపు ప్రస్తావన

- 2017లో జరిగిన ఓ పార్టీలో ట్రంప్ తన పాత స్నేహితులను గుర్తించలేదన్న ఎప్ స్టీన్
- డిమెన్షియాతో బాధపడుతున్నాడేమోనని అప్పట్లోనే అనుమానాలు
- దీనిపై ట్రంప్ బయోగ్రఫీ రాస్తున్న మైఖేల్ వోల్ఫ్ కు ఎప్ స్టీన్ ఈమెయిల్

అంతర్జాతీయం, నవతరం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జ్ఞాపకశక్తిపై ఇటీవల సందేహాలు నెలకొన్న విషయం తెలిసిందే. బహిరంగ సభల్లో, కీలక వేదికలపై ఆయన ఉన్నట్టుండి ప్రసంగం ఆపేయడం, వ్యక్తుల పేర్లను మరిచిపోయిన సంఘటనల తర్వాత ఈ సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయం ఎప్ స్టీన్ ఫైల్స్ లోనూ ప్రస్తావనకు వచ్చినట్లు తాజాగా విడుదల చేసిన ఫైల్స్ లో



మిగతాది 2 లో...

## రాంబాబుకు బెయిల్ మంజూరు

**సీఎంపై వ్యాఖ్యల కేసులో అంబటి రాంబాబుకు బెయిల్**

**విడుదలవుతున్న సమయంలోనే మరో కేసు తెరపైకి**

**పోలీసులతో దురుసు ప్రవర్తన కేసులో 14 రోజుల రిమాండ్**

**ఈ నెల 22 వరకు అంబటికి జ్యుడీషియల్ కస్టడీ**

**తిరిగి రాజమహేంద్రవరం జైలుకే అంబటి**



ఆంధ్రప్రదేశ్, నవతరం

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఒక కేసులో ఊరట లభించినా, ఆయన జైలు నుంచి ఇప్పట్లో విడుదలయ్యే అవకాశం కనిపించడం లేదు. సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కేసులో గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టు ఇవాళ ఆయనకు బెయిల్ మంజూరు

మిగతాది 2 లో...

## సూపర్ సిక్స్ సూపర్ హిట్

**అంధకారం నుంచి రాష్ట్రాన్ని బయటపడేశాం**

**గత 19 నెలల పాలనపై మంత్రులు, కార్యదర్శులతో సీఎం చంద్రబాబు సమీక్ష**

**సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని వ్యాఖ్య**

**తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ పథకాల ప్రగతిపై వివరణ**

**పేదలను ఆదుకునేందుకు సంక్షేమ పథకాలు కచ్చితంగా అవసరమని స్పష్టీకరణ**



ఆంధ్రప్రదేశ్, నవతరం

ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, ప్రభుత్వ శాఖల కార్యదర్శులతో సమీక్షా సమావేశం జరిగింది. గత 19 నెలల ప్రభుత్వ పాలన, పథకాల అమలు, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

మిగతాది 2 లో...

## స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాసానికి విపక్షాల ప్లాన్

**లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైన విపక్షాలు**

**ప్రధానిపై దాడి జరగొచ్చన్న స్పీకర్ వ్యాఖ్యలతో రాజుకున్న వివాదం**

**8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్‌తో మరింత పెరిగిన రాజకీయ వేడి**

జాతీయం, నవతరం

కేంద్ర ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య తీవ్రమవుతున్న విభేదాల నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి. పార్లమెంట్ సమావేశాల్లో చోటుచేసుకుంటున్న వరుస పరిణామాలు, ఇరుపక్షాల మధ్య అపనమ్మకం ముదరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

మిగతాది 2 లో...




# రాంబాబుకు బెయిల్ మంజూరు



చేసింది. దీంతో ఆయన జైలు నుంచి బయటకు వస్తారని అంతా భావించారు. అయితే, ఆయన బెయిల్‌పై విడుదలవుతున్న సమయంలోనే పట్టాభిపురం పోలీసులు మరో కేసులో రంగప్రవేశం చేశారు. గతంలో పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై నమోదైన కేసులో పీటీ వారెంట్‌పై అంబటిని స్పెషల్ జ్యుడీషియల్ కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును విచారించిన న్యాయస్థానం, ఆయనకు 14 రోజుల పాటు అంటే ఈ నెల 22 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. సీఎంపై వ్యాఖ్యల కేసులో ఈ నెల 1న అరెస్టయిన అంబటి, అప్పటి నుంచి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉంటున్న విషయం తెలిసిందే. తాజాగా ఒక కేసులో బెయిల్ వచ్చినా, మరో కేసులో రిమాండ్ పడటంతో పోలీసులు ఆయన్ను తిరిగి రాజమహేంద్రవరం జైలుకు తరలించారు. కాగా, అంబటి రాంబాబుపై రాష్ట్రవ్యాప్తంగా సుమారు 36 కేసులు నమోదైనట్లు సమాచారం.

# సూపర్ సిక్స్ సూపర్ హిట్



ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, గడిచిన 19 నెలల్లో రాష్ట్రాన్ని అగాధం, అంధకారం నుంచి బయటపడేశామని, కుప్పకూలిన వ్యవస్థలను తిరిగి గాడిన పెట్టగలిగామని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే తొలి ప్రాధాన్యమని ఆయన పునరుద్ఘాటించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని ముఖ్యమంత్రి తెలిపారు. 'తల్లికి వందనం' ద్వారా తల్లుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.10 వేల కోట్లు జమ చేశామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న 'స్త్రీశక్తి' పథకం ద్వారా రాష్ట్రంలో మహిళల మొబిలిటీ పెరిగిందని, ఇప్పటివరకు 4.29 కోట్ల ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయని వివరించారు. దీనివల్ల ప్రస్తుతం ఉన్న బస్సుల ఆక్యుపెన్సీ కూడా గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రైతులకు రూ. 6,310 కోట్ల ఆర్థిక సహకారం అందించామని తెలిపారు. వీటితో పాటు 'దీపం 2.0' ద్వారా 2 కోట్ల గ్యాస్ సిలెండర్లు, 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ల ద్వారా రూ.58 వేల కోట్ల ఆర్థిక చేయూత అందించినట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించామని, డిమాండ్‌కు అనుగుణంగా పంటలు పండించేలా రైతుల్లో అవగాహన కల్పిస్తున్నామని చంద్రబాబు అన్నారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా, కోస్తా తీరాన్ని ఆక్వా కల్చర్‌లో అగ్రగామిగా నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతు ఆత్మహత్యలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ఒకవేళ దురదృష్టవశాత్తు ఎవరైనా ఆత్మహత్యకు పాల్పడితే, ఆ కుటుంబాలను ఆదుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవడం ద్వారా నిర్దేశిత లక్ష్యాలను చేరుకుంటున్నామని, ప్రతీ మూడు నెలలకోసారి పనుల పురోగతిపై బేరీజు వేస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, ఇన్‌చార్జ్ మంత్రులు కూడా ఇదే వేగంతో క్షేత్రస్థాయిలో పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు. "సంక్షేమ పథకాలు అవసరమా అనే చర్చ సరికాదు. పేదలను ఆదుకోవడానికి సంక్షేమ పథకాలు కచ్చితంగా అవసరమే" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఏపీలో త్వరలో నంది నాటకోత్సవాలు

- సాంస్కృతిక రంగాన్ని మళ్లీ గాడిలో పెడుతున్నామన్న మంత్రి
- కళాకారులకు ఉగాది పురస్కారాలు, కందుకూరి పురస్కారాలు కూడా అందజేస్తామని వెల్లడి
- నెల్లూరు జిల్లాలో మహాకవి తిక్కన విగ్రహం ఏర్పాటు అంశంపై త్వరలో సీఎం నిర్ణయం తీసుకుంటారన్న మంత్రి



ఆంధ్రప్రదేశ్, నవతరం

రాష్ట్రంలో త్వరలోనే నంది నాటకోత్సవాలు నిర్వహించడంతో పాటు నంది అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఏపీ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ, ఎన్టీఆర్ జిల్లా అధికారులు, మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ పున్నమి ఘాట్ వద్ద బోధిసిరి బోటులో నిర్వహించిన 'కృష్ణాతీరం కవితాహారం' కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కుంటుపడిన సాంస్కృతిక రంగాన్ని మళ్లీ గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కళాకారులకు ఉగాది పురస్కారాలు, కందుకూరి పురస్కారాలు కూడా అందజేస్తామని తెలిపారు. ఇక, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో మహాకవి తిక్కన విగ్రహం ఏర్పాటు అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఇప్పటికే చర్చించామని, త్వరలో తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. అమరావతి ఒడిలో ప్రవహించే కృష్ణమ్మకు ఈతరం కవులు సమర్పించిన కవితా హారతిగా ఈ కార్యక్రమం నిలిచిందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఏపీ, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 51 మంది కవులు కవితలు వినిపించడంతో కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది.

# భార్యాభర్తల మాటలు కూడా విన్నారు

తెలంగాణ, నవతరం

గత బీఆర్ఎస్ పాలనలో ఫోన్ ట్యాపింగ్ ద్వారా ప్రజలను బ్లాక్‌మెయిల్ చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ అంటే 'బ్లాక్‌మెయిల్ రాజకీయ సమితి' అని అభివర్ణించిన ఆయన, ఫోన్ ట్యాపింగ్‌తో వందల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఖాతాలో ఉన్న రూ.1,500 కోట్లు అక్రమ మార్గాల్లో సంపాదించినవేనని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ములుగు జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. పదేళ్ల పాలనలో అధికారాన్ని దుర్వినియోగం చేసి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అక్రమ సంపదను కూడబెట్టారని రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. వ్యాపారవేత్తల ఫోన్లు ట్యాప్ చేసి, వారి ఆస్తులను బలవంతంగా బదిలీ చేయించుకున్నారని బీజేపీ ఎంపీ కొండా



విశ్వేశ్వర్ రెడ్డి చెప్పిన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, న్యాయమూర్తులు, సినీ తారలనే కాకుండా చివరికి భార్యాభర్తల మధ్య సంభాషణలను కూడా విన్నారని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాళేశ్వరం, ఫార్ములా-ఈ రేస్ కుంభకోణాలపై సీబీఐ విచారణకు ఆదేశించకపోవడంపై కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి 'కిషన్ రావు'గా మారి కేసీఆర్‌కు దత్తపుత్రుడిగా మారారని ఎద్దేవా చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై సీబీఐ, ఈడీ కేసులు పెట్టిన కేంద్రం, కాళేశ్వరం స్కామ్‌పై విచారణకు ఎందుకు వెనుకాడుతోందని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను కిషన్ రెడ్డి కాపాడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీలు ఒకే నాణేనికి రెండు ముఖాలని, కాంగ్రెస్‌ను ఓడించేందుకు రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయని అన్నారు. కసీఆర్ కుటుంబం టీవీ ఛానెళ్లు, వార్తాపత్రికలతో వేల కోట్ల వ్యాపారాలు సంపాదించింది కానీ, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టివ్వలేదని రేవంత్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తోందని, రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇళ్లు కట్టిస్తున్నామని తెలిపారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని, భూపాలపల్లి జిల్లాను రద్దు చేస్తారనేది అవాస్తవమని స్పష్టం చేశారు. అసెంబ్లీలో చర్చించకుండా, ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా ఏ జిల్లాను రద్దు చేసేది లేదని హామీ ఇచ్చారు.

# నియోజకవర్గాలకు ర్యాంకులు

నియోజకవర్గం రెండో స్థానాన్ని దక్కించుకుంది. కాకినాడ అసెంబ్లీ నియోజకవర్గం, విజయవాడ తూర్పు నియోజకవర్గాలు వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. ప్రభుత్వ పథకాల అమలు, శాసనసభ్యులు ప్రజలకు అందుబాటులో ఉండటం, ఫైళ్ల పరిష్కారం వంటి పలు కీలక అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ఈ సర్వే నిర్వహించారు. రాష్ట్రంలోని మొత్తం 175 నియోజకవర్గాలను ఏ, బీ, సీ, డీ గ్రేడులుగా విభజించారు. వీటిలో 21 నియోజకవర్గాలు ఏ గ్రేడులో, 153 నియోజకవర్గాలు బీ గ్రేడులో ఉండగా, కేవలం ఒక్క నియోజకవర్గం మాత్రమే డీ గ్రేడులో నిలవడం గమనార్హం. పాలనలో సాంకేతికతకు పెద్దపీట వేస్తున్న చంద్రబాబు, క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఇటీవలే ఎమ్మెల్యేలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించి, వారి పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ముఖ్యంగా తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలకు సలహాలు ఇస్తూ, వారిని ప్రోత్సహిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ సాధించిన పల్లా శ్రీనివాసరావు, తాజాగా ఆయన నియోజకవర్గం పనితీరులోనూ రెండో స్థానంలో నిలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. పనితీరును మరింత మెరుగుపరచుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఈ సందర్భంగా చంద్రబాబు ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు.



# బ్రాండింగ్, నాణ్యతే ముఖ్యం



సహాయక సంఘాలు తయారు చేసే ఉత్పత్తుల కోసం 'స్వయం' అనే పేరుతో ప్రత్యేక బ్రాండ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ బ్రాండ్ ద్వారా వారి ఉత్పత్తులకు అతిపెద్ద మార్కెట్ అందుబాటులోకి వస్తుందన్నారు. అరకు కాఫీ తరహాలోనే కోకో పంటకు కూడా మంచి బ్రాండ్ తీసుకురావాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులపై దృష్టి సారించాలని ఆదేశించారు. నగరాల్లో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల (ఎస్టీపీ) నిర్మాణం కోసం అవసరమైన భూసేకరణ చేపట్టాలన్నారు. రూ.300 కోట్ల వ్యయంతో ఈ ప్లాంట్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, దీనికి అవసరమైన నిధులను పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) సమకూరుస్తుందని తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులతో పేరుకుపోయిన చెత్తను (లెగసీ వేస్ట్) వేగంగా తొలగించాలని స్పష్టం చేశారు.

**50శాతం పచ్చదనమే లక్ష్యం** రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఉగాది నుంచి పాఠశాలల్లో దేశీయ వృక్ష జాతుల పెంపకంపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వాములను చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. తీరప్రాంత కోత నివారణకు ఉపముఖ్యమంత్రి చేపట్టిన ప్రాజెక్టును అభినందించిన సీఎం, కోతను అరికట్టడంతో పాటు రైతులకు ఆదాయం అందించేలా ఆర్కిడ్స్ సాగును ప్రోత్సహించాలని సూచించారు.

# స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాసానికి విపక్షాల ప్లాన్

గత గురువారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించాల్సి ఉండగా, విపక్షాల తీవ్ర నిరసనల మధ్య సభను స్పీకర్ అర్ధాంతరంగా వాయిదా వేశారు. 'ప్రధానిని లక్ష్యంగా చేసుకుని ప్రతిపక్ష ఎంపీలు ఏదో అనుకోనిది చేయొచ్చని సమాచారం అందింది' అని ఓం బిర్లా చెప్పడం వివాదానికి దారితీసింది. అంతకుముందు కొందరు మహిళా ఎంపీలు ప్లకార్డులతో ప్రధాని సీటు వద్దకు (ఆ సమయంలో ప్రధాని అక్కడ లేరు) వెళ్లారు. స్పీకర్ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ "పూర్తి అబద్ధాలు" అని కొట్టిపారేశారు. "ప్రధాని ఇప్పుడు స్పీకర్ చాటున దాక్కుంటున్నారు... ఆయనకు ధైర్యం లేదు" అని ఆమె తీవ్రంగా విమర్శించారు. ఈ అవిశ్వాస తీర్మానంలో స్పీకర్‌కు వ్యతిరేకంగా మూడు ప్రధాన అంశాలను ప్రతిపక్షాలు హైలైట్



చేయనున్నాయి. మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే రాసిన పుస్తకంలోని కొన్ని భాగాలను చదివేందుకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి అనుమతి నిరాకరించడం మొదటిది. అదే సమయంలో కాంగ్రెస్‌ను, గాంధీ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్న పుస్తకాల నుంచి చదివేందుకు బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేకు అనుమతి ఇవ్వడంపై విపక్షాలు మండిపడుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన దూబేపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నాయి. 2020లో భారత్-చైనా సరిహద్దు వివాదంపై ఉన్న ఆ పుస్తక భాగాలను రికార్డుల్లో చేర్చాలని రాహుల్ పట్టుబట్టారు. తాను ఆ సమాచారానికి బాధ్యత వహిస్తానని లిఖితపూర్వకంగా ఇచ్చినా స్పీకర్ అంగీకరించలేదు. దీంతో సభలో తీవ్ర గందరగోళం చెలరేగింది. ఈ క్రమంలో నిరసన తెలిపిన 8 మంది కాంగ్రెస్ ఎంపీలను సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేశారు. "రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. దీనిపై నిరసన తెలిపితే మమ్మల్ని సస్పెండ్ చేశారు. ఇది అంత పెద్ద నేరమా?" అని సస్పెండైన ఎంపీ అమరీందర్ రాజా వారింగ్ ప్రశ్నించారు. ఈ పరిణామాలతో పార్లమెంట్‌లో రాజకీయ వేడి మరింత పెరిగింది.

# ట్రంప్ మతిమరుపు ప్రస్తావన



బయటపడింది. మతిమరుపు వ్యాధి డిమెన్షియాతో బాధపడుతున్నాడేమోనని అప్పట్లోనే ఆయన స్నేహితులు అనుమానాలు వ్యక్తం చేసినట్లు ఎప్ స్టీన్ ఓ ఈమెయిల్ లో పేర్కొన్నాడు. 2017లో జరిగిన ఓ పార్టీకి డొనాల్డ్ ట్రంప్ తో పాటు పలువురు సెలబ్రెటీలు హాజరయ్యారని ఎప్ స్టీన్ చెప్పాడు. అంతకుముందు ట్రంప్ కు కొంతకాలం సన్నిహితంగా మెలిగిన స్నేహితులనూ ఆయన గుర్తుపట్టలేదని చెప్పాడు. దీంతో ట్రంప్ జ్ఞాపకశక్తిపై వారు సందేహం వ్యక్తం చేశారని అన్నాడు. ట్రంప్ కుటుంబంలో డిమెన్షియా బాధితులు ఉన్న విషయాన్ని గుర్తుచేస్తూ ట్రంప్ ను కూడా ఈ సమస్య వేధిస్తున్నట్లు ఉందని అభిప్రాయపడ్డట్లు వివరించాడు. ఈ విషయాన్ని అప్పట్లో ఓ జర్నలిస్ట్ కు, ట్రంప్ బయోగ్రఫీ రాస్తున్న మైఖేల్ వోల్ఫ్ కు రాసిన ఈమెయిల్ లో ఎప్ స్టీన్ పేర్కొన్నాడు. కాగా, తన మానసిక ఆరోగ్యంపై జరుగుతున్న ప్రచారాన్ని ట్రంప్ కొట్టిపారేశారు. ఇటీవల జరిగిన వైద్య పరీక్షల్లో తాను శారీరకంగా, మానసికంగా ఫిట్ గా ఉన్నట్లు తేలిందని చెప్పారు.



# ఫీజు రీయింబర్స్మెంట్ బాకాయిలు వెంటనే చెల్లించాలి : టీకే విశ్వేశ్వర రెడ్డి



( నవతరం-రాజమహేంద్రవరం) రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్,అన్ ఎయిడెడ్ కళాశాలలకు ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్మెంట్ బాకాయిలు చెల్లించాలని ఏపీ ఎఫిలియేటెడ్ ప్రైవేట్ అండ్ అన్ ఎయిడెడ్ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ గౌరవ సలహాదారు, రాజమహేంద్రి మహిళా కళాశాలల చైర్మన్ టీకే విశ్వేశ్వర రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో సోమవారం ఉదయం స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు.ఈ సందర్భంగా పలు కళాశాలల విద్యార్థులు స్వచ్ఛందంగా తరలి వచ్చి దీక్షలో కూర్చుని ప్రభుత్వం తక్షణమే స్పందించి ఫీజు రీయింబర్స్మెంట్ బాకాయిలు వెంటనే చెల్లించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీకే విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ 6500 కోట్లు, జిల్లా వ్యాప్తంగా 250 కోట్లు ఫీజు రీయింబర్స్మెంట్ బాకాయిలు 9 వాయిదాలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని చెప్పారు.అవి చెల్లించలేక పోవడం వల్ల విద్యార్థులకు యూనివర్సిటీ నుంచి డిగ్రీ సర్టిఫికెట్లు మంజూరు కావడం లేదని, ఈ పరిస్థితి వల్ల ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్ కు వెళ్లే విద్యార్థులు, ఇతర ఉద్యోగార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా 1130 కళాశాలు, జిల్లాలో 234 కళాశాలలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం తక్షణమే ఫీజు రీయింబర్స్మెంట్ కోసం చర్యలు తీసుకోకుంటే అమరావతి లో సచివాలయం ఎదుట వేలాది విద్యార్థులతో నిరసన చేపడతామని, అప్పుడు కూడా ప్రభుత్వం సానుకూలంగా స్పందించక సైతం వెనుకాడబోమని అన్నారు. అదే జరిగితే చంద్రబాబు ప్రభుత్వానికి అది మాయని మచ్చగా మిగిలిపోతుందని ఆక్షేపించారు.ఇటీవల రాజమండ్రిలో విద్యా శాఖ మంత్రి లోకేశ్ ను కలిసినపుడు డిసెంబర్ లో ఫీజు రీయింబర్స్మెంట్ బాకాయిలు వేస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇంతవరకు ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు.ఈ విషయంలో లోకేష్ తన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షలో రాజమహేంద్రి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ తేతలి సత్య సౌందర్య, ప్రిన్సిపాల్ ఎం.కె.ఎస్.ప్రసాద్, ఎ.ఒ.రామిరెడ్డి, వెంకట్ తదితరులు కూర్చున్నారు. ఈ దీక్షకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ పిసిసి ఉపాధ్యక్షులు మార్టిన్ లూథర్, ప్రచార కమిటీ చైర్మన్ డాక్టర్ వడయార్, రాజమండ్రి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలేపల్లి మురళీధర్, డాక్టర్ సెల్ చైర్మన్ డాక్టర్ రాజశేఖర్, రాష్ట్ర కిసాన్ సెల్ చైర్మన్ హరిబాబు, రాజానగరం నియోజకవర్గం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ వడయార్, జిల్లా జనరల్ సెక్రెటరీ నల్ల వీర్రాజు, రాజమహేంద్రవరం రూరల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ ఇవాళ వీరభద్రరావు, రాజీవ్ గాంధీ కళాశాల లెక్చరర్లు, డైరెక్టర్ కరుకూరి శైలజ, కాలేజీల యాజమాన్య మిత్రులందరు వచ్చి తదితరులు వచ్చి ఫీజు రీయింబర్స్మెంట్ పై డాక్టర్ టి.కే. విశ్వేశ్వర రెడ్డి చేస్తున్న నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించే వరకు ఉద్యమానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.




# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- వావ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి దుర్గాప్రసాద్
- జ్ఞాన సరస్వతి స్కూల్ నందు వావ్ ప్రోగ్రాం

(నవతరం -గోకవరం) పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా చేపట్టాలని ఐ.టి.సి. ఆధ్వర్యంలో ఏ. జి. ఎస్. ఆర్గనైజేషన్ వావ్ ప్రోగ్రాం స్కూల్ కో ఆర్డినేటర్ పి.దుర్గబాబు పిలుపు నిచ్చారు. గురువారం గోకవరం జ్ఞాన సరస్వతి స్కూల్ ఆవరణలో స్కూల్ చైర్మన్ కంచర్ల సూర్య ప్రకాష్ డైరెక్టర్ మరియు ఫౌండర్ బొడ్డేటి సురేష్,,ప్రిన్సిపాల్



బొడ్డేటి వరలక్ష్మి కంచర్ల అన్నపూర్ణ (మెంటర్ )ఆధ్వర్యంలో వావ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇంటర్ స్కూల్ రీసైక్లింగ్ ఛాంపియన్ షిప్ కార్యక్రమామంలో పాత పుస్తకాలు, పాత పేపర్లు అందించి, దానికి తగిన విద్యా సామాగ్రిని అందించారు. ఒక పేపర్ను 9సార్లు రీసైక్లింగ్ చేస్తామని, దీని ద్వారా చెట్లను కాపాడుకోవచ్చునన్నారు. ఒక టన్ను పేపర్ తయారు కావాలంటే 17 చెట్లు అవసరమని, ప్రతి ఒక్కరూ రీసైకిలింగ్ సహకరిస్తే, చెట్లను కాపాడుకోవచ్చునని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు చైతన్యవంతులై పాత పుస్తకాలు వృధా పేపర్లు తమకు అందించారు. అనంతరం వావ్ ప్రోగ్రామ్ లో స్కూల్ టాపర్ గా నిలిచి ఇంటర్ స్కూల్ ఛాంపియన్ షిప్పు కైవసం చేసుకున్న పి. వి. ఎన్. అమృత్ (ఆరవతరగతి)అలాగే వి. హేమన్స్ సూర్య)రెండవ తరగతి) కి ట్రోఫీలను,ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు బంగారు పతకాలను, పాల్గొన్న విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందచేశారు. ఎజీఎస్ కోఆర్డినేటర్ ఎన్.రాముడు ఆధ్వర్యంలో ప్రతి పాఠశాలలోనూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల లడ్డూపై కూటమి ప్రభుత్వ అసత్య ప్రచారంపై మండిపడ్డ చిర్ల జగ్గిరెడ్డి





(నవతరం - రావులపాలెం) తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పవిత్ర లడ్డూ ప్రసాదంపై కూటమి ప్రభుత్వం కావాలనే చేస్తున్న అసత్య ప్రచారాన్ని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి కేంద్రబిందువైన తిరుమల లడ్డూ ప్రసాదంపై అబద్ధపు ఆరోపణలు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం స్వామివారి ప్రసాదాన్ని కూడా వదలకుండా అపవాదులు మోపడం కూటమి ప్రభుత్వ నీచ రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. తిరుమల లడ్డూ తయారీ పూర్తిగా సంప్రదాయాలు, శాస్త్రోక్త విధానాలు, అత్యున్నత నాణ్యత ప్రమాణాలతో జరుగుతుందని, ఈ విషయం దేశంలోని ప్రజలందరికీ తెలుసునని జగ్గిరెడ్డి స్పష్టం చేశారు. అయినప్పటికీ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా కావాలనే అసత్య ప్రచారం చేయడం భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీయడమేనని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే ఈ అసత్య ప్రచారాన్ని నిలిపివేసి, తిరుమల తిరుపతి దేవస్థానంపై, స్వామివారి ప్రసాదంపై ఉన్న అపార విశ్వాసాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. లేకపోతే త్వరలోనే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లారీ ఢీకొని వృద్ధుడి మృతి

- వాడపల్లి - రావులపాలెం రహదారిపై వరుస ప్రమాదాలు.
- చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్


(నవతరం - రావులపాలెం) రావులపాలెం మండల పరిధిలోని వాడపల్లి-- రావులపాలెం ప్రధాన రహదారిపై శుక్రవారం ఉదయం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు. రావులపాలెం ఎస్సై కేవీ రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 9వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో ఊబలంక గ్రామానికి చెందిన బండారు వెర్రియా (79) టీ త్రాగేందుకు రోడ్డు వద్దకు వచ్చాడు. ఈ క్రమంలో కనకమహాలక్ష్మి ఆలయం సమీపానికి చేరుకున్న సమయంలో, రావులపాలెం నుంచి ఆత్రేయపురం వైపు వెళ్తున్న ఏపీ 39 డబ్ల్యుజి 3639 నంబర్ గల లారీని డ్రైవర్ అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా, అతివేగంతో నడిపి వృద్ధుడిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన బండారు వెర్రియ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుడు బండారు వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ఇదే రహదారిపై గతంలో కూడా ఇసుక లారీల ఢీకొనడంతో పలువురు మృతి చెందిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి గాంచిన వాడపల్లి శ్రీ వెంకన్న స్వామి ఆలయానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు ద్విచక్ర వాహనాలు, కార్లు, బస్సుల ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రద్దీ రహదారిపై ఇరువైపులా ఆక్రమణలతో షాపులు ఏర్పాటు చేయడంతో పాటు, ఇసుక లారీలు వందల సంఖ్యలో మితిమీరిన వేగంతో రాకపోకలు సాగించడం ప్రమాదాలకు ప్రధాన కారణమవుతోందని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటం, ట్రాఫిక్ నియంత్రణ లోపించడం, హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్ల ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమ ఆక్రమణలను తొలగించి, అవసరమైతే విశాలమైన రహదారి నిర్మించి, ఇసుక లారీల వేగ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదాలు నివారించేలా తక్షణమే చర్యలు చేపట్టకపోతే మరిన్ని ప్రాణనష్టాలు



తప్పవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# కోనసీమ తిరుమల వాడపల్లి ఆలయంలో భక్తుల సౌకర్యాలపై డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణ...





( నవతరం - ఆత్రేయపురం) కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో రోజురోజుకు పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు భక్తుల సౌకర్యాలపై ప్రత్యేకంగా పర్యవేక్షించారు. క్యూ లైన్ల నిర్వహణ, దీపారాధన చేయు ప్రదేశాలు, అన్నదాన కార్యక్రమం, పార్కింగ్ సౌకర్యాలు, మాడ వీధులలో ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించి, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. భక్తులు సౌకర్యవంతంగా దర్శనం చేసుకునేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.



# సమస్యల పరిష్కారానికి అధికారులు బాధ్యతతో పనిచేయాలి డి.ఆర్.ఓ.: కె.మాధవి

(నవతరం -అమలాపురం) సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం బాధ్యతగా అంకితభావంతో పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మాధవి సూచించారు సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి భవన్ నందు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారుల నుండి సుమారుగా 200 అర్జీలను డి.ఆర్.ఓ.సమగ్ర శిక్ష ఏపీసి జి. మమ్మీ, డి ఎల్ డి వో రాజేశ్వరరావులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేదిక ద్వారా ప్రజల నుంచి అందుతున్న ప్రతి అర్జీపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను వేగంగా, సమర్థ వంతంగా పరిష్కరించాలని ఆమె అధికారులకు సూచించారు. రెవెన్యూ సేవలతో పాటు ఇళ్లస్థలాలు, ఇళ్ల మంజూరు, ఉపాధి, పెన్షన్ మంజూరు తదితరా లకు సంబంధించి అర్జీలు అందాయన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా పని చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి అర్జీని లోతుగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించి, తీసుకొన్న చర్యల వివరాలను అర్జీదారులకు సరైన విధంగా తెలియజేయాలని ఆదేశించారు. పీ.జీ.ఆర్.ఎస్. కార్యక్రమంలో సమర్థవంతంగా పనిచేస్తూ కోనసీమ జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు వచ్చేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయా లన్నారు. ముఖ్యంగా భూ సంబంధిత సమస్యలు, తాగునీరు, పారిశుధ్యం, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



